శ్రీ సాయిరాం

# జగమే రామమయం

(సంగీత నృత్య నాటిక)

భగవాన్ శ్రీ సత్యసాయి సేవాసంస్థలు

విజయనగరం జిల్లా, ఆంధ్రప్రదేశ్.

ఓం శ్రీ సాయిరాం

# జగమే రామమయం (సంగీత నృత్య నాటకం)

భగవంతుని సన్నిధానములో ప్రదర్శించబడే ఈ నాటికలో మొదటి ఘట్టం శ్రీ వారి దివ్య పాదపద్మములకు సమర్పిస్తూ, మనందరం ఈ ప్రార్థనతో ప్రారంభిద్దాం.

## ప్రార్థన

శ్లో॥ సంసార సాగర సముత్తరణైకమంత్రం
బ్రహ్మాదియోగి మునిపూజిత సిద్ధమంత్రం
దారిద్ర్య దు:ఖ భవరోగ వినాశమంత్రం
వందే మహాభయహరం సాయిరామమంత్రం
(కేసన, కావ్యం వ్రాసుకుంటూ రామనామ గానం చేస్తూంటే పిల్లలు
నృత్యం చేస్తూ ఉంటారు మొల్ల రాముణ్ణి అలంకరిస్తూ ఉంటుంది.)

కేసన: ప॥ మేలుకో శ్రీరామా – మేలుకో శ్రీరామా
నీలనీరదశ్యామా – మేలుకో మేలుకో మేలైన గుణధామా
॥ మేలుకో శ్రీరామా ॥

చ॥ అలనీల గగనమ్ము అరుణారుణమ్మాయె
కులదైవ ముదయాద్రి కొలువుండె పయనించె
కొలను తామరలన్ని పులకించి విరసినవి
నళినాబ్జ ఇక నీదు నయనాలు విడవలెను ॥ మేలుకో శ్రీరామా ॥

చ॥ పదయుగళి సేవించ ప్రణతులే యొనరించ
వదనారవిందంబు ముదమార పరికించ
బంగారు వాకిళ్ళ పడిగాపులై యున్న
భక్తకోటిని వేగ పాలింప లేవయ్యా ॥ మేలుకో శ్రీరామా ॥

కేసన: అమ్మా! మొల్లమ్మా! ఏం చేస్తున్నావమ్మా!

మొల్ల: అందాల రాముణ్ణి అలంకరిస్తున్నాను నాన్నగారూ!

కేసన: రాముడికి అలంకరణ దేనికమ్మా? ఆయన నీల మేఘశ్యాముడు, మెరుపులాంటి చిరునవ్వుతో పట్టు పీతాంబరంతో మిలమిలా మెరిసిపోతూ ఉంటాడు. అట్లాంటి రాముణ్ణి

అలంకరించడం కాదు, గుండెలో గుడి కట్టుకుని రామా! రామా! అని స్మరిస్తూ ఆరాధించాలమ్మా!

మొల్ల: ఆరాధిస్తే రాముడేం చేస్తాడు నాన్నా?

కేసన: రాముడు కరుణాసముద్రుడమ్మా! రామా అని జపించిన రత్నాకరుణ్ణి వాల్మీకి మహర్షిగా మార్చి రామచరిత్ర వ్రాయించుకున్నాడు. రాయిగా ధూళిలో పడి రామా రామా అని తపించిన అహల్యను తన దివ్య పాదస్పర్శతో శాపవిమోచనం చేసి అతివగా మార్చాడు! కారడవిలో రాముని రాక కోసం కన్నులు కాయలు కాసేలా ఎదురు చూచిన శబరి వద్దకు నడిచి వెళ్లి ఆమె ఇచ్చిన మధుర ఫలాన్ని ఆరగించాడు. రాముణ్ణి హృదయంలో నింపుకుని నిరంతరం రామనామాన్ని జపించిన మారుతికి పాదసేవా సౌభాగ్యాన్నిచ్చి చిరంజీవిని చేశాడమ్మా.

మొల్ల: రాముడు అంత దయామయుడా నాన్నగారూ?

కేసన: రాముని దయాగుణం అనుభవిస్తే తప్ప ఎంత వర్ణించినా విన్నా...అర్థం కాదమ్మా.

మొల్ల: అంత దయామయుడైతే నీలాంటి మంచి మనసున్న మనిషిని కులం తక్కువ వాడివనే చిన్న చూపుకెందుకు గురిచేశాడయ్యా!

కేసన: రాముడేం చేసినా అది మనకు వరప్రసాదమేనమ్మా!

మొల్ల: పేదరికం కూడా వరమేనంటావా నాన్నా?

కేసన: మామూలు వరం కాదమ్మా. దివ్య వరం, ఎందుకో చెప్పనా! రాగిజావ తాగితే కడుపు నిండుతుంది. రాయి తలకింద పెట్టుకుంటే నిద్ర పడుతుంది. నిరంతరం రామతారక మంత్రాన్ని హాయిగా పాడుకుంటూ నిశ్చింతగా గడపొచ్చు ధనవ్యామోహం, కులాభిమానం మనస్సుని ఆవహిస్తే ఇవి సాధ్యమవుతాయా చెప్పమ్మా.

మొల్ల: ధనవ్యామోహం ఉంటే దైవం ఎక్కడ గుర్తుంటాడు నాన్నా!

కేసన: చక్కగా చెప్పావమ్మా. ఆ...పద శ్రీరామ మందిరానికి వెళదాం.

మొల్ల: ఎందుకు నాన్నా?

కేసన: (తాళపత్ర గ్రంథం చూపిస్తూ) ఇదిగో చూశావా రామచంద్రప్రభువు అనుగ్రహించి నాచే వ్రాయించిన నీలకంఠమల్లేశ్వర శతకం.

మొల్ల: పండితులు వ్రాసే శతకం నువ్వు వ్రాసావా నాన్న!

కేసన: నేను రాయడం ఏమిటమ్మా! శ్రీరాముడు వ్రాయించాడు! అందుకే ఆ శతకాన్ని శ్రీరామ ప్రభువుకే అంకితం చేస్తాను...పద

\- - - - -

(కేసన, మొల్ల ఇరువురు శ్రీరామ మందిరం చేరుకుంటారు. కేసన ప్రార్థిస్తూ ఉంటాడు)

రామా! పరంధామా! ఈ నీలకంఠేశ్వర శతకాన్ని నీ పాదాల వద్ద పూజా సుమంగా సమర్పిస్తున్నాను. అందుకో స్వామీ!

పూజారి: ఆగు! కేసనా ఎంతకు తెగించావయ్యా! కుండలు చేసుకునే వాడివి కోవెలలో ప్రవేశించి ఈ పవిత్ర ప్రదేశాన్ని అపవిత్రం చేస్తావా!

కేసన: లేదు మహాశయా! నేను వ్రాసిన ఈ నీలకంఠేశ్వర శతకాన్ని రాముడికి అర్పిద్దామని వచ్చాను.

పూజారి: పామరుడివి, నువ్వు కవిత్వం రాయడమా! పండితులమని పేరుపడ్డ, మాకే సాధ్యం కాలేదు.

మొల్ల: బహుశా మీకు చేతనయి ఉండదు.

**మొదటి**

పండితుడు: మాకు చేతకాదంటావా నీ తండ్రి మహా చేతనయినవాడా....!

మొల్ల: ఆయనకు భక్తి ఉంది. భాష ఉంది. మీకేముంది....అహంకారం తప్ప.

**రెండో**

పండితుడు: చూశారా పూజారిగారూ! ఈ అమ్మాయి నన్నెలా ఎగతాళి చేస్తోందో....! ఇంకా ఊరుకుంటారేవిటండీ.

పూజారి: అమ్మాయి నీ వాచాలత్వం కట్టిపెట్టు. మేం తలచుకుంటే ఏమైనా చెయ్యగలం.

మొల్ల: ఏం చెయ్యక్కర్లేదు. ఒక్క కావ్యం వ్రాసి చూపించండి.

**మొదటి**

పండితుడు: అయ్యా మీరు ఇక ఊరుకుంటే లాభంలేదు. తక్షణమే గ్రామాధికారితో చెప్పి ఈ నేరానికి శిక్ష వేయించండి.

కేసన: బాబూ! మన్నించండి. పసితనం, తెలియక ఏదో మాట్లాడింది. నా బిడ్డ అమాయకురాలు. నా బిడ్డనూ నన్నూ శిక్షించకండి. అమ్మా...ఊరుకోమ్మా...!!

మొల్ల: ఏంటయ్యా ఊరుకునేది. వీరినెత్తిన కొమ్ములు మొలిచాయా? వీరిని సృష్టించిన భగవంతుడే మననీ సృష్టించాడు. ఏమిటి వీరి గొప్ప? మనకన్నా అధికులు ఎలా అయ్యారు?

పూజారి: అంతంత మాటలంటూ ఉంటే అమాయకురాలని ఊరుకోవాలా?పండిత ప్రకాండులం, మమ్మల్నే ఎదిరించేంత సాహసవంతురాలయిందన్నమాట.

మొల్ల: అవును, లేకపోతే ఆలయ ప్రవేశార్హత లేదని చెప్పటానికి మీరెవరు? "మమైవాంశో

జీవలోకే జీవభూతస్సనాతన:" అని భగవద్గీత బోధిస్తున్నది. సర్వ మానవులూ దైవస్వరూపులని సాక్షాత్తూ దైవమే చెప్తుంటే కాదనటానికి మీకున్న అధికారమేమిటి?

కేసన: అమ్మా! మొల్లమ్మా ఊరుకోమ్మా! పెద్దల్ని అలా ప్రశ్నించకూడదు.

మొల్ల: ప్రశ్నించకపోబట్టే ఈ అనాచారం ఇలా సాగుతోంది. ఈ కులాల గోడల్ని కూలగొడతాను. రాముడు అందరివాడని నిరూపిస్తాను. తానాదుకోవడానికి ఈ కులమత బేధాలు చూడడని ఋజువు చేస్తాను.

పూజారి: మమ్మల్ని ఎదిరించి ఎలా చేస్తావో చూస్తాను!

మొల్ల: ఇప్పుడే చూపిస్తాను. కళ్ళారా చూడండి. ఆనందించండి. నల్లమ్మా! రంగమ్మా! మల్లమ్మా! అందరూ రండి.

పాట: ప॥ జగమేలు రాముడంటా – మహిలోన వెలసెనంటా
సీతమ్మ వలపుపంటా – సిరులిచ్చు భాగ్యమంటా
ఆ ముచ్చటయిన జంట – ఎంతెంతో కనులపంట ॥ జగ ॥

చ॥ మన మనసు ఆలయాన వెలిగేటి రూపమంట
రావణుని కూల్చినట్టి జగదేకవీరుడంట
సీతమ్మ నేలినట్టి సుగుణాభిరాముడంట ॥ జగ ॥

చ॥ మన కష్టమంత బాపి మదిలోన కొలువు తీరి
ఆర్తులను బ్రోచు రామా భక్తులకు పుణ్య దామా
శ్రీరామ మహిమకన్నా ఇలలేదు రన్నమిన్న ॥ జగ ॥

చ॥ అల తండ్రి మాటకోసం వనసీమ కేగినట్టి
శ్రీరామ రామమంత్రం శిరులిచ్చు వేద మంత్రం
సీతమ్మ తోడునీడై శుభమిచ్చునామ మంత్రం ॥ జగ ॥

(పూజారులు, వేద పండితులు పాట విని కోపంతో నిష్క్రమిస్తారు. పాట అవుతుండగా పూజారులు, గ్రామాధికారి ప్రవేశిస్తారు)

పూజారి: మహాశయా! కులాలు, గోత్రాలు పాటించకుండా ఈ రామ మందిరాన్ని ఎలా అపవిత్రం చేస్తున్నారో చూడండి. పండితులక్కూడా అలవికాని కవిత్వాన్ని తాను రాశానని చెప్పుకుంటూ ఆలయంలో ప్రవేశించిన ఈ కేసనను చూడండి. అతని కూతురు చేయిస్తున్న ఈ నృత్యాన్ని చూడండి. విచారణ చేసి న్యాయ సమ్మతంగా మీరే శిక్ష విధించండి.

మొల్ల: "శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే. సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే"

(మొల్ల నిష్క్రమిస్తుంది)

\- - - - -

## (అడవిలో మొల్ల ప్రవేశం)

ప॥ రాయినయినా కాకపోతిని రామపాదము సోకగా
బోయనయినా కాకపోతిని పుణ్యకావ్యము వ్రాయగా
పడవనయినా కాకపోతిని స్వామి కార్యము తీర్చగా
పాదుకైనా కాకపోతిని భక్తి రాజ్యము నేలగా ॥ రాయి ॥

చ॥ అడవిలోపల పక్షినైతే అతివ సీతను కాననా
అందువలన రామచంద్రుని అమిత కరుణను నోచనా
కడలిగట్టున ఉడుతనైతే ఉడుత సాయము చేయనా
కాలమెల్లా రామభద్రుని వ్రేలి గురుతులు మోయనా ॥ రాయి ॥

చ॥ కాకినైన కాకపోతిని ఘాతుకము కావించుచూ
గడ్డిపోచను శరము చేసే ఘనత రాముడు చూపగా
మహిని మూగజీవులే ఈ మహిమలన్నీ నోచగా
మనిషినై జన్మించినాను, మచ్చరాలే పెంచగా ॥ రాయి ॥

మొల్ల: శ్రీరామచంద్రా! తల్లీ దండ్రి అయా ఆదరించిన కన్నతండ్రిని వదలి నీ పాదాల చెంతకు చేరుకున్నాను. నా జీవన నావను ఏ తరానికి చేరుస్తావో నీ ఇష్టం. నీ సంకల్పం ఏదైనా సంతోషంగా స్వీకరిస్తాను. ఆశీర్వదించు.

(శ్రీరాముడు మొల్లకు సాక్షాత్కరిస్తాడు)

రాముడు: అమ్మా! మొల్లా! నీ శరణాగతి నన్ను ముగ్ధుణ్ణి చేసింది. లే గంటం చేతపూను. వాల్మీకి రచించిన రామకథను తేట తెలుగులో రచించు, నీ చెయ్యి పట్టుకుని నేను వ్రాయిస్తాను. నీవు రచించిన రామచరిత్ర ఆచంద్రతారార్కం మృదుమధురంగా గానం చేయబడుతుంది.

మొల్ల: శ్రీరామచంద్రా! సకలసద్గుణసాంద్రా! నన్ను నీ చరిత్ర వ్రాయటానికి ఎన్నుకున్నావా తండ్రీ! ఇక నేను కోరదగినది ఏమీ లేదు. రామచరిత్ర వ్రాసి నా జన్మ సార్థకం చేసుకుంటాను.

\- - - - -

తే॥గీ॥ కపటమెరుగని సత్య వాక్యములవాడు
రమణీ రాముండు శుభలక్షణముల వాడు
ఇన్ని గుణముల రూపింప నెసగువాడు
వరుస సౌమిత్రి బంగారు వన్నెవాడు

తె॥రా॥ : నీ కవితా స్రవంతి అపురూపంగా ఉందమ్మా! ఎన్నాళ్లలో ఈ రామాయణ కావ్యాన్ని వ్రాయగలనని అనుకుంటున్నావో చెప్పమ్మా!

మొల్ల: మహాకవీ! రామానుగ్రహంతో అయిదు రోజులలో పూర్తి చెయ్యాలని అనుకుంటున్నాను.

తె॥రా: అయిదు రోజుల్లోనా....! అయితే ఈ అద్భుతాన్ని నేనే స్వయంగా రాయలవారికి మనవి చేస్తాను. అయిదు రోజుల తర్వాత ఈ పరమాద్భుతాన్ని దర్శించటానికి రాయలవారినే స్వయంగా తోడ్కొని వస్తాను. నీ కృషి ఫలించుగాక. మీరు పదండి.

మొల్ల: ప॥ రామా దయాపరా సీమా అయోధ్యాపురధామా
మావంటి వారి తప్పులు లోగొనవే

చ॥ అపరాధి అయినట్టి ఆతని తమ్ముని ని
కృప జూపితిని నీవు చింతలుమాని
తపియించి అమ్మును మొనదారకు చిక్కిన వాని
నెప్పాన గాచి విడచి నీవాడనెంచితివి. ॥ రామా ॥

చ॥ చేయిరాని ద్రోహమును చేసిన పక్షికి నీవు
పాయగ అప్పటి నభయ మినిచ్చితివి.
చాయి చేసుకుని ఉండి స్వామితో చెప్పనట్టు
తూయగ చేగొని మంచి త్రోవనే పెట్టితివి
నేరము లెంచవు నీవు నీ దయ చూపుదు గాని
ధీరము శరణాగతి బిరుదవు నీవు

చేరి నేడు నిలుచుంటివి శ్రీ వెంకటాద్రి మీద కోరిన వరములెల్ల కొల్లగా నొసగితివి

వందిమాగధులు : రాజాధిరాజ మహారాజ, ఆంధ్రభోజ రాజన్యకోటీర మణిగణ విభాసమాన పాదారవింద కవిరాయా! శ్రీ కృష్ణదేవరాయా బహుపరాక్! బహుపరాక్!

**(శ్రీ కృష్ణ దేవరాయలు ప్రవేశాన్ని సూచించే సంగీతం)**

పూజారి: విజయనగర సామ్రాజ్య కవి సార్వభౌమా! తెనాలిరామా! దయచేయండి

మొల్ల: సరస్వతీ పుత్రులు రామలింగ కవి వర్యులకు పాదాభివందనం.

కేసన: మహాకవులకు నమస్కారం

తె॥రా॥ : అభివాదాలు. ఎవరు వీరు.

పూజారి: మహాకవీ! కుండలు చేసుకునే వంశంలో పుట్టి కులగోత్రాలను లెక్క చేయకుండా ఆలయంలో ప్రవేశించి అపవిత్రం చేస్తున్నారు. తాము చేసిన నేరానికి గ్రామ బహిష్కరణ శిక్ష పాటించకుండా ఆలయంలోనే రామచరిత్రను వ్రాస్తామని మరో అఘాయిత్యానికి పూనుకుంటున్నారు. వీరి నేరాన్ని రాయలవారికి మనవి చేసి తగిన శిక్ష విధించేలా చూడండి.

తె॥రా॥ అమ్మా! వీరి అభియోగానికి మీ సమాధానం.

మొల్ల: ఆంధ్రభోజుల సత్కారాన్ని అందుకున్న కవి వరేణ్యులు. మీకు చెప్పదగిన దానను కాను. ఈ భగవత్ సృష్టిలో సర్వులూ సమానమన్నదే నా అభిమతం. భగవత్ సన్నిధిలో ప్రవేశాన్ని నిషేధించడానికి ఎవరికీ అధికారం లేదని నా అభిప్రాయం. నా తండ్రి రచించిన నీలకంఠ మల్లేశ్వర శతకాన్ని అగ్నికి ఆహుతి చేసిన మహనీయులు వీరు. నేను రామాజ్ఞతో రామాయణాన్ని వ్రాయ సంకల్పించు కున్నాను. అది ఈ మందిర ప్రాంగణంలోనే చేస్తాను. రాముడి అనుమతి అయింది. ఇక ఎవరి అనుమతీ నాకు అవసరం లేదు.

పూజారి: ఆమె వాచాలత్వం చూశారా మహాకవీ!

తె॥రా॥ : విన్నాను. ఆమె ఆత్మవిశ్వాసాన్ని, మీ అజ్ఞానాన్నీ కూడా చూశాను. రామాయణ రచన సాగకుండా నిషేధించే హక్కు మీకు గానీ ప్రభువుకు గానీ లేదు. అమ్మా! నీ కవితాప్రజ్ఞను తెలుసుకోవాలని నాకు కుతూహలంగా ఉంది. రామలక్ష్మణులను వర్ణిస్తూ ఒక పద్యం ఆశువుగా చెప్పమ్మా!

మొల్ల: సీ॥ "నీలమేఘచ్ఛాయబోలు దేహమువాడు
ధవళాబ్జపత్రనేత్రముల వాడు
కంబు సన్నిభమైన కంఠంబు కలవాడు
బాగైన యట్టి గుల్ఫముల వాడు
తిన్ననై కనుపట్టు దీర్ఘ బాహులవాడు
ఘనమైన దుందుభి స్వనమువాడు
పద్మరేకుల గల్గు పదయుగంబు వాడు
చక్కని పీన పక్షమ్ము వాడు

(శ్రీ రామాలయం వద్ద కేసన విషాదంలో మునిగి వుండగా మొల్ల ప్రవేశిస్తుంది)

శరణు వేడెదా యజ్ఞ సంభవ రామా.

అరసి రక్షించు మమ్ము అయోధ్యరామా

కేసన: అమ్మా! మొల్లమ్మా! ఎప్పుడొచ్చావు తల్లీ! గ్రామాధికారులు కంటపడలేదా. గ్రామంలో ప్రవేశించకుండా వారు నిన్ను అడ్డుకోలేదా?

మొల్ల: నాన్నా! సాక్షాత్తూ శ్రీరామచంద్రుడే నాకు గ్రామ ప్రవేశాన్ని కల్పించాడు. తన దివ్య సమ్మోహన రూపాన్ని దర్శనమిచ్చి నన్ను తరింపజేశాడు. వాల్మీకి రచించిన శ్రీమద్రామాయణాన్ని నన్ను వ్రాయమని ఆనతిచ్చాడు.

కేసన: రామచంద్రుడు నీకు సాక్షాత్కరించాడా! రామాయణ మహాకావ్యాన్ని వ్రాయమని నీకు ఆదేశించాడా. నా రామచంద్రుడు దయాసాగరుడని చెప్పానా! నమ్మినవారిని చేయి పట్టుకుని నడిపిస్తాడని అన్నానా....!

మొల్ల: నువ్వు చెప్పిన ప్రతి అక్షరం సువర్ణాక్షరం నాన్నా! రాముని రచనగా రామాయణాన్ని ప్రారంభిస్తాను. ఆశీర్వదించు నాన్నా!

కేసన: శ్రీరామచంద్ర కృపా కటాక్ష ప్రాప్తిరస్తు. ఇక్కడే శ్రీరాముని సన్నిధిలోనే రామాయణ రచన ప్రారంభించు. ఆ కావ్యం పూర్తయ్యేవరకు ఇక్కడే శ్రీరామ స్మరణ చేస్తూ నిరాహారంగా నేను ఉంటాను. నీ రచనకూ, నా స్మరణకూ ఎవరూ అభ్యంతరాలు కల్పించలేరు.

## మొదటి

వేద పండితుడు: అయ్యా! ఆచారిగారూ! కొంప మునిగింది. రండి...రండి....

పూజారి: మళ్ళీ ఎవరైనా ఆలయ ప్రవేశం చేసారా?

రెండవ

వేద పండితుడు: ప్రవేశం చెయ్యడమేమిటండీ మొల్ల, ఇక్కడ తిష్ఠ వేసుకుని రామాయణ మహాకావ్యాన్ని వ్రాస్తుందట.

పూజారి: రామాయణ కావ్యాన్ని వ్రాయడమంటే కుండలు చెయ్యడం అనుకున్నదా? మనం వ్రాయనిస్తే కదా?

మొల్ల: వ్రాయించటానికీ, వ్రాయించకపోవటానికీ మీరెవరు? ఆ శ్రీరామచంద్రుడే నాకు ఆనతిచ్చాడు.

పూజారి: ఆహా! అలాగా! అంత గొప్ప భక్తురాలివా? ఇదిగో ఇప్పుడే విజయనగర సంస్థాన అష్టదిగ్గజాలలో మహాకవి వర్యులు శ్రీ తెనాలి రామలింగ కవి విచ్చేస్తున్నారు. రాయలవారితో చెప్పి మీ అనాచారానికి తగిన శిక్ష విధించేలా వారే చూస్తారు.

మొల్ల: ప్రభూ! నా మనవి వినండి.

గ్రామాధికారి: కళ్ళారా చూశాక వినవలసిన అవసరం లేదు. కులగోత్రాలు పరిగణించకుండా అందరినీ ఆలయ ప్రాంగణంలోకి తీసుకువచ్చి పరమ పవిత్రమయిన ఈ మందిరాన్ని అపవిత్రం చేసి క్షమించరాని నేరం చేశావు. ఇందుకు నీకు గ్రామ బహిష్కరణ శిక్ష విధిస్తున్నాను. శతకాన్ని సమర్పించాలనే నెపంతో ఆచార వ్యవహారాలను కించపరిచినందుకు ఈ నీలకంఠేశ్వర శతకాన్ని అగ్నికి ఆహుతి చెయ్యండి. శిక్షను తక్షణమే అమలు చెయ్యండి.

(కేసన, మొల్ల తల వంచుకుని నిష్క్రమిస్తారు)

పూజారులు ఆనందంగా కేసన శతకాన్ని తీసుకుని నిష్క్రమిస్తారు)

**విషాద సంగీతం.......**

\- - - - -

కేసన: నేను చెప్తే విన్నావా అమ్మా! ఎంత అనర్థం దాపురించిందో చూశావా! ఆడబిడ్డవు. ఈ గ్రామాన్ని వదిలి ఎలా జీవించగలవమ్మా?

మొల్ల: నాన్నా! రాముడు దయామయుడని, కరుణాసాగరుడని, అనంతగుణధాముడని, అవ్యాజ ప్రేమమూర్తి అని పొగిడావే మరి ఏదీ ఆ కరుణ? ఆహోరాత్రులు రామా రామా అని తపిస్తూ ఆ స్వామి పాదాలకే నీ శతకాన్ని అంకితం చేశావే స్వీకరించాడా? అగ్నిలో దగ్ధం అయిపోతుంటే చూస్తూ ఊరుకున్నాడు. ఇంత జరిగిన తర్వాత కూడా ఇంకా రాముడు నిన్ను ఆదుకుంటాడనే నమ్మకం ఉందా నీకు?

కేసన: ఉందమ్మా! రామునిపై నా నమ్మకం, ఎన్నటికీ సడలిపోదు. పతివ్రతా శిరోమణి, మా అమ్మ, సీతమ్మను అగ్ని ప్రవేశం చెయ్యమన్నాడు. ఆహుతి చెయ్యడానికా? కాదమ్మా! అగ్ని పునీతగా సీతమ్మకు కీర్తి ప్రతిష్ఠలు ఆర్జించడానికి ఆమె పాతివ్రత్యం ఆచంద్రతారార్కంగా నిలిచేందుకు, నా శతకాన్ని కూడా సీతను పునీతను చేసి రామునికి సమర్పించిన అగ్నిదేవుడే శ్రీరాముని పాదాల వద్దకు చేర్చి ఉంటాడమ్మా! ఇంతకన్నా అదృష్టం ఎవరికుంటుంది తల్లీ!

మొల్ల: నాన్నా! నీ నరనరాల్లోనూ రామతత్వం జీర్ణించుకుపోయింది. నీ రాముణ్ణీ నిన్నూ ఎవ్వరూ విడదీయలేరు.

కేసన: అమ్మా! నీ గుండెలోనూ రాముణ్ణే నింపుకో. రాముడే నీ ఊపిరిగా జీవించు. రాముని కోసం గంగాఝరీ ప్రవాహంలా కన్నీరు కార్చు. శ్రీరామచంద్రమూర్తి నీ కళ్ళముందు సాక్షాత్కరించేలా తపించు. నువ్వు సాధించాలనుకున్నవన్నీ ఆ కోదండరాముడే సాధిస్తాడు. కన్నతండ్రిగా నేను నీకు ఇవ్వగలిగినదీ, ఇచ్చేదీ ఒక్కటే. అదే తారక మంత్రం “శ్రీరామ రామరామేతి రమేరామే మనోరమే.

సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే” ఇంక నువ్వు బయలుదేరమ్మా, రాముడే నీకు దారి చూపిస్తాడు.

కేసన: అమ్మా! మొల్లమ్మా! విజయనగర సామ్రాజ్య ప్రభువులు శ్రీకృష్ణదేవరాయలు విచ్చేశారమ్మా

మొల్ల: ‘ఆముక్తమాల్యద’ భక్తిరస ప్రబంధాన్ని వాణి గళసీమ నలంకరించిన ఆంధ్రభోజులకు నా వందనశతాలు ప్రభూ.

తె॥రా॥: అమ్మా! మొల్లమాంబా! నీ కవితా మాధుర్యాన్ని స్వయంగా విని ఆనందించడానికీ, అయిదు రోజుల్లో రామాయణ మహాకావ్యాన్ని రచించిన అద్భుతాన్ని దర్శించడానికీ విజయనగర ప్రభువులు రాయలవారే స్వయంగా విచ్చేశారమ్మా.

మొల్ల: అది శ్రీరామానుగ్రహం, ఇదుగో నా తండ్రి కేసన ఆశీర్వాదం ప్రభూ...

రాయలు: అమ్మా! మొల్లమాంబా రామాయణ మహాకావ్యాన్ని అయిదు రోజుల్లో రచించడం నిశ్చయంగా శ్రీరామానుగ్రహమే. ఏదీ నీ రామాయణంలో ఒక్క పద్యం చదివి వినిపించు తల్లీ.

మొల్ల: సుడిగొని రామపాదములు సోకిన ధూళి వహించి రాయి ఏర్పడనొక కాంత అయ్యెనట
పన్నుగ నీతని పాదరేణు వియ్యడబడిన్ ఓడసోక ఇది ఏనుగునో అని సంశయాత్ముడై
కడిగె గుహుండు రామపదపంకజ యుగంబు భయంబు పెంపునన్!

రాయలు: ‘శభాష్ మొల్లమాంబా! కవిత్వ చమత్కారం భక్తి రసఝరీ ప్రవాహం సమ్మిళితమైన మీ కవిత్వం విని మా జన్మ చరితార్థమయింది. మీ వంటి భక్త శిఖామణి, కవయిత్రి జన్మించిన ఈ రాయలసీమ ధన్యమయింది. మీరేదైనా కోరుకోండి అనుగ్రహించడానికి సిద్ధంగా ఉన్నాం.

తె॥రా॥ అవును. రాయలసీమను ప్రభువులు రతనాల సీమగా మారిస్తే నువ్వు రామాయణ సీమగా మార్చావు. కోరుకో తల్లీ!

మొల్ల: ప్రభూ! శ్రీరామానుగ్రహం కంటె కోరదగినదేముంది. అది నాకు పుష్కలంగా లభించింది. నాకు కావలసినది అనంత కరుణాసాగరుడు. ఆ శ్రీరామచంద్ర ప్రభువునే కోరుకుంటాను.

కృష్ణదేవరాయలు: కేసనా! ఆణిముత్యంలాంటి కుమార్తెను శ్రీరాముని పాదాల చెంతకు చేర్చావు. మీకు నా నమోవాకాలు.

– – – – –

మొల్ల: శ్రీరామచంద్రా! జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపీ గరియసీ అని నీవే చెప్పావు. నేను పుట్టిన భూమి తల్లిలేని నన్ను కన్నతల్లి కంటే మిన్నగా ఆదరించింది. నా జన్మభూమిని నీ పవిత్ర పాదస్పర్శతో పునీతం చేసి రాయలసీమను రామసీమగా మార్చు. సమస్త మానవాళి ఈ భూమిని దర్శించేలా చెయ్యి ఈ భూమిపై రామ రాజ్యాన్ని స్థాపించు. అనంత కళ్యాణ గుణదాముడివైన నీ గుణగానంతో మార్మోగేలా చెయ్యి చాలు.

శ్రీరాముడు: అమ్మా! మొల్లమాంబా భక్తి భావనలు చిందిస్తూ రామకథను రచించిన నీ నిర్మల భక్తి నన్ను ముగ్ధుణ్ణి చేసింది. నీ కోరిక తప్పక మన్నిస్తాను. ఈ రాయలసీమలోనే సత్యసాయిరాముడిగా అవతరిస్తాను. సాయిరామ స్మరణతో ఈ ప్రాంతమే కాదు విశ్వమంతా ప్రతిధ్వనిస్తుంది. కులమత బేధాలు మరచి అందరూ ఒక కుటుంబంలా మసిలే మహాపుణ్యక్షేత్రంగా పుట్టపర్తిని తీర్చిదిద్దుతాను. దాహార్తులు, రోగార్తులు లేని రామరాజ్యాన్ని స్థాపిస్తాను. నీ వంటి ఎందరో కవులు, కవయిత్రులు నా అవతార వైభవాన్ని రచించి ఈ సీమలోనే గానం చేస్తారు. నీ రామాయణం విన్న తర్వాత నాకే స్వయంగా నా రామావతార కథను వ్రాసుకోవాలనిపిస్తుంది. అందుకే రామకథా రసవాహినిగా నా చరిత్రను రచించి సాయిరామ సీమగా రాయలసీమకు కీర్తిప్రతిష్ఠలు తెస్తాను. ఈ సీమలోనే రాయలు ప్రతిష్ఠించిన విరూపాక్ష లింగంలో సాయిరాముడిగా దర్శనమిచ్చి నేను సర్వేశ్వరుడినని, సర్వజగద్రక్షకుడినని సర్వ ప్రపంచానికి తెలియజేస్తాను. నా చరిత్రముందు నీ పేరు కలిపి 'మొల్ల రామాయణం' గా నీ రచన ప్రశంసించబడుతుంది.

మొల్ల: ధన్యోస్మి రామచంద్రా ధన్యోస్మి
రఘుకుల తిలకా నీ ఆనతి రచియించితి రామాయణ సత్కృతి
అకృతి వరియించిననా పతివి నీవే
అతులిత కైవల్యగతివి నీవే

ప॥ జగమే రామమయం మనసే అగణిత తారక నామమయం

చ॥ నీలజలద రమణీయ వందిత చరణం సురముని శరణం భవతాపహరణం
॥ జగ ॥

చ॥ ఆ చిరునవ్వే అమృతపు జల్లు అఖిల జగములేలు ఆచేతివిల్లు

అతని నామమున అలరారుకావ్యం అన్ని యుగాలకు నవ్యాతి నవ్యం
ఎవని కమల కమనీయ పదము చూపించె అహల్యకు ముక్తిపదం
ఎవని చంద్రికా మృదుల కరము నందించెను శబరికి దివ్యవరం
ఎవని ఏలుబడి ఇంటికొక్క గుడినిలిపెనో
ఎవని రాజ్యమే రామరాజ్యమై వెలిసెనో
ఆ రాముడు నా ఆంతరంగమున నిండగా
అహం మరచి, ఆ ఇహం మరచి
ఆ మహర్జ్యోతిలో నే లీనం కానా, ఆ మహాప్రభువులో ఐక్యంకానా
ఓ రామా! – రఘురామా! కైవల్యధామా!

స్వామీ, మా ఉడతాభక్తితో మేము ప్రదర్శించిన
ఈ నాటిక
మా జీవితాలలో వెలుగు ప్రసరింపజేసేలా,
మమ్మల్ని ఆశీర్వదిస్తారని ప్రార్థిస్తూ ...

# శ్రీ సత్యసాయి సేవా సంస్థలు

**విజయనగరం జిల్లా, ఆంధ్రప్రదేశ్**

**ఓం శాంతి శాంతి శాంతి:**